**90**

**ధారావాహిక**



# జాయ సేనాపతి

## చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** **‘తమిళ నాట్యబృందం నిర్వహిస్తున్న గోదాకల్యాణం యక్షగాన ప్రదర్శన చూద్దామా!?’ అంటూ వచ్చాడు పరాశరుడు. జాయపునికి కూడా ఆసక్తి కలిగింది. అతను ఇంతవరకూ పరభాషా ప్రదర్శనలు చూడలేదు. మిత్రునివెంట ఉత్సాహంగా వెళ్లాడు. పుర ప్రముఖులతో ఆ మందిరం కిటకిటలాడిపోతున్నది. కళా ప్రదర్శనలో చెలికత్తెల నృత్తం మనోహరంగా సాగుతున్నది. ఆ ప్రదర్శన చూస్తున్న జాయపుణ్ని.. ఏదో తెలియని తన్మయత్వం ఊపేస్తున్నది. రెప్ప వేయకుండా చూస్తున్నాడు.**

ఆ ముద్రలు, స్థానకాలు, రేచకాలు, కరణులు, పిండిబంధాలు, బృంద రూపకల్పన.. సంగీతబద్ధ కదలికలు.. కంటికి ఇంపుగా ఉన్నాయి. నటీమణులు కూడా మెరపుతీగల్లా ఉన్నారు. పాడుతూ పాడుతూ వెళ్లి గోదాదేవిని తీసుకుని వచ్చారు. అద్భుతమైన సంగీతవాద్యాల నేపథ్యంలో.. గాయనీమణుల మృదువైన ఆహ్వానగీతంతో కదలివచ్చిన గోదాదేవిని చూస్తూ.. మాట పడిపోయినట్లయ్యాడు జాయపుడు. ఆ నటి ముమ్మూర్తులా దేవతలా దేవుణ్ని ప్రేమించి భజిస్తున్న ముగ్ధ జవ్వనిలా.. అచ్చమైన గోదాదేవి ఆమె!

శభాష్.. పాత్రధారణ అంటే ఇలా ఉండాలి!!

**గోదాదేవీ వందనమూ.. శ్రీరంగనాయకీ వందనమూ..**
**ధరణిపుత్రీ.. వందనమూ.. మంగళ దీపికా వందనమూ..**

రంగనాథుణ్ని ప్రేమించి పూజించి ఆరాధించి మార్గశిర మాసమంతా పాశురాలను రచించి పరవశించి పాడి ఆయనను పరవశింపజేసి.. విగ్రహమూర్తిగానే ఆయనకు దగ్గరైన గోదాదేవి కథాంశం.. నిజంగా మధురమే!

మొదటి అంకంలో ఈ సంగతులన్నీ చెబుతూ ఆమె ప్రతిమ ఆరాధనను, ప్రేమను ఆమెముందే కీర్తిస్తూ చెలికత్తెలు ఆ అంకాన్ని అద్భుతంగా రక్తి కట్టించారు.

జాయపునికి బాగా నచ్చింది కథ. అర్చామూర్తిని.. అంటే విగ్రహారూపాన్ని ప్రేమించడం.. భలే.. విస్మయం!!

విష్ణువు అర్చావతారాలు ఐదు. పరం, వ్యూహామూర్తి, విభవమూర్తి, అంతర్యామి, అర్చామూర్తి.

రెండవ అంకంలో రంగనాథుడు అర్చామూర్తిగా ప్రవేశించాడు. నిజమైన స్వామి విగ్రహమే కదలాడుతున్నట్లు ఆ పాత్రధారికి రంగోద్దీపనం చేశారు.

ఆయనపట్ల గోదాదేవికి ఉన్న తీవ్రమైన ప్రేమను ఆరాధనను వ్యక్తపరుస్తూ ఈ అంకమంతా నడిచింది. గోదాదేవి, రంగనాథ అర్చామూర్తి, చెలికత్తెలు.. తమ నటనతో ఆ అంకాన్ని గొప్ప రమణీయ కావ్యంగా ప్రదర్శించారు. తర్వాత వారిద్దరి ప్రణయ సన్నివేశాలు.. ముగింపుగా వివాహఘట్టం!!

ప్రదర్శన అంతా చూశాక అద్భుతం అనిపించింది జాయపునికి. కానీ, నాట్య సంప్రదాయాలను.. అంగ, ప్రత్యంగ, కరణ, ముద్ర, పిండిబంధ.. తదితర నాట్య రూపకల్పనా విధానాలను పోల్చిచూస్తే.. మన ఆంధ్రుల కూర్పు మరింత అద్భుతంగా ఉంటుంది. నీలాంబక్క అయితే ఈ గోదాకల్యాణాన్ని మరింత గాఢంగా రూపుదిద్దగలదు. ఈ తమిళనాట్య సంప్రదాయాలు తెలుగువారి సంప్రదాయాల కంటే కాస్త తక్కువస్థాయిలో ఉన్నట్లు భావించాడు. కానీ కానీ.. ఈ ప్రదర్శనలో ఏదో ఆకర్షణ ఉంది. ఏమిటది.. ఏమై ఉంటుంది?!

ఆ నటీనటబృందం ప్రదర్శనలో ఏ తాదాత్మ్యాన్ని పొందుతుందో.. ప్రేక్షకుడిగా తనూ ఆ తన్మయత్వాన్ని పొందాడు.. అది నిజం!!

మళ్లీ తాదాత్మ్యం.. తన్మయత్వం!! ప్రదర్శన చూసి ప్రగాఢంగా ప్రభావితమైనవాడు పరాశరుడు.

‘‘జగన్నాథా! చూడు చూడు భలే ఉంది. తెలుగులో దీనెమ్మా మొగుడులాంటి యక్షగానం రాస్తాను చూడు’’.